## 80 వేల పైకి పుత్తడి

### రూ.1,100 పెరిగిన తులం ధర



న్యూఢిల్లీ, నవంబర్ 22: బంగారం ధరలు మళ్లీ పుంజుకుంటున్నది. ఆభరణాల వర్తకులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతోపాటు పెండ్లిళ్ల సీజన్ కూడా కావడంతో రిటైలర్లు కూడా కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో వరుసగా రెండో రోజు శుక్రవారం కూడా భారీగా పెరిగింది. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పుత్తడి ధర మళ్లీ రూ.80 వేల మార్క్‌ను అధిగమించింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన తులం ధర మరో రూ.1,100 అందుకొని రూ.80,400కి చేరుకున్నట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గురువారం బంగారం ధర రూ.79,300గా ఉన్నది. వరుసగా రెండు రోజుల్లో బంగారం ధర రూ.2,500 పెరిగినట్లు అయింది. బంగారంతోపాటు వెండి ధరలు పుంజుకున్నాయి. కిలో వెండి ధర రూ.300 అధికమై రూ.93,300 పలికింది. ఇటు హైదరాబాద్‌లోనూ 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ తులం గోల్డ్ ధర రూ.870 అధికమై రూ.78,820కి చేరుకున్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.800 ఎగబాకి రూ.72,250 పలికింది. కిలో వెండి రూ.1.01 లక్షల వద్ద స్థిరంగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,695 డాలర్లు, వెండి 31.19 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

## బీఎండబ్ల్యూ కార్లు మరింత ప్రియం

న్యూఢిల్లీ, నవంబర్ 22: లగ్జరీ కార్ల సంస్థ బీఎండబ్ల్యూ కూడా తన పోటీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ బాటపట్టింది. జనవరి నుంచి వాహన ధరలు మూడు శాతం వరకు పెంచబోతున్నట్లు ప్రకటించింది. దేశీయంగా తయారైన 2 సిరీస్ గ్రాన్ కౌప్, 3 సిరీస్ లాంగ్ వీల్‌బేస్, 5 సిరీస్ లాంగ్ వీల్‌బేస్, 7 సిరీస్ లాంగ్ వీల్‌బేస్‌తోపాటు ఎక్స్1, ఎక్స్3, ఎక్స్5, ఎక్స్7, ఎం340ల తోపాటు ఐ4, ఐ5, ఐ7 ఎం70, ఐఎక్స్1, బీఎండబ్ల్యూ ఐఎక్స్, జెడ్4 ఎం40ఐ, ఎం2 కౌప్ మాడళ్లను విక్రయిస్తున్నది.

# కార్పొరేట్లకు అదానీ సెగ

### దేశీయ ఇండస్ట్రీ పరపతిపై ప్రభావం • పెట్టుబడులపై పునరాలోచనలో విదేశీ మదుపరులు

న్యూఢిల్లీ, నవంబర్ 22: అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీపై అమెరికా నేరారోపణలు.. యావత్తు భారతీయ వ్యాపార-పారిశ్రామిక రంగాల పరపతినే దెబ్బతీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సోలార్ పవర్ కాంట్రాక్టులను దక్కించుకోవడానికి లంచాలు, తప్పుడు ప్రకటనలతో నిధుల సమీకరణలు, అంతర్జాతీయ మదుపరులను మోసగించారన్న ఆరోపణలు అదానీ, ఆయన సంస్థలు, ఉన్నతోద్యోగులపై వచ్చాయి. అదానీ గ్రూప్ ప్రతిష్ఠాత్మకంగా భావించే అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, దాని ప్రాజెక్టుల్లోనే ఈ అవకతవకలు చోటుచేసుకోగా.. గత రెండున్నర దశాబ్దాలుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజకీయ అనుచరుడిగా కూడా అదానీ ఉండటంతో ఇప్పుడు రాజకీయాల్లోనూ ఈ కేసు హాట్ టాపిక్‌గా మారిపోయింది.



**ఎఫ్ఐఐల్లో గుబులు**

అదానీ వ్యవహారం విదేశీ సంస్థాగత మదుపరులలో (ఎఫ్ఐఐలు) గుబులు రేపుతున్నది. దేశీయ వ్యాపార-పారిశ్రామికవేత్తల అవినీతి బాగోతాలు, ఇక్కడి నిబంధనల ఉల్లంఘనలు, రెగ్యులేటరీ వ్యవస్థల్లోని లోపాలపై విదేశీ మదుపరులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మోసం చేసి బ్యాంకుల నుంచి పెద్ద ఎత్తున రుణాలు తీసుకొని ఎగవేసిన ఘటనలు కార్పొరేట్ భారతంలో కోకొల్లలు. ఈ క్రమంలో అదానీ గ్రూప్‌పై గత ఏడాది హిండెన్‌బర్గ్ రిసెర్చ్ ఆరోపణలు, ఇప్పుడు అమెరికా నేరారోపణలు.. విదేశీ ఇన్వెస్టర్లను పునరాలోచనలో పడేస్తున్నాయి. ఇప్పటికే దేశీయ మార్కెట్ల నుంచి భారీగా పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో అదానీపై అమెరికా ఏకంగా అరెస్ట్ వారెంట్‌నే జారీ చేయడం.. అదానీ సంస్థకేగాక, మొత్తం భారతీయ పరిశ్రమకే మచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్‌పై విశ్వాసం సన్నగిల్లడం ఖాయమన్న ఆందోళనలూ గట్టిగానే వినిపిస్తున్నాయి.

**జీక్యూజీ షేర్ల బైబ్యాక్**

అదానీ గ్రూప్‌లోని అతిపెద్ద మదుపరులలో ఒకటైన అమెరికాకు చెందిన జీక్యూజీ పార్ట్‌నర్స్.. షేర్ల బైబ్యాక్‌కు దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గౌతమ్ అదానీ, మరో ఏడుగురిపై అమెరికాలో తీవ్ర నేరారోపణల కేసు నమోదైన నేపథ్యంలో జీక్యూజీ షేర్ బైబ్యాక్‌కు ప్రాధాన్యత ఏర్పడుతున్నది. ఈ కేసు దెబ్బకు గురువారం ఒక్కరోజే గ్రూప్ మార్కెట్ విలువ భీకర స్థాయిలో కరిగిపోయిన విషయం తెలిసిందే. జీక్యూజీ షేర్ల విలువ కూడా 19 శాతం హరించుకుపోయింది. ఈ నేపథ్యంలోనే మరిన్ని నష్టాలను అడ్డుకునేలా సొంత షేర్లను తిరిగి ఇన్వెస్టర్ల నుంచి కొనే దిశగా అడుగులు వేస్తున్నట్టు చెప్తున్నారు. గత ఏడాది జనవరిలో హిండెన్‌బర్గ్ రిసెర్చ్ రిపోర్టుతో కుదేలైన అదానీ గ్రూప్‌నకు జీక్యూజీ దన్నుగా నిలిచింది. రూ.80,000 కోట్లతో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌లలో పెట్టుబడులు పెట్టింది.

**సెబీ దర్యాప్తు..**

అదానీపై అమెరికాలో కేసుకు సంబంధించి భారతీయ క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ దర్యాప్తు చేస్తున్నది. అయితే ఇప్పటికైతే ఈ వ్యవహారంలో మార్కెట్ నిబంధనల ఉల్లంఘనలు ఏమైనా జరిగాయా? అన్న కోణంలోనే సెబీ ఆరా తీస్తున్నట్టు సమాచారం. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్.. మార్కెట్‌ను ప్రభావితం చేసే ఈ అమెరికా నేరారోపణల అంశాన్ని నిబంధనల ప్రకారం తెలియపర్చిందా? అని స్టాక్ ఎక్స్చేంజీల ద్వారా సెబీ కనుక్కుంటున్నది. కాగా, రెండు వారాల్లో ఈ కేసుపై మరింత లోతుగా విచారణకు సెబీ నిర్ణయం తీసుకుంటుందా? లేదా? అన్నది తెలుస్తుందని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు తాజా కేసు.. అదానీ కంపెనీల్లో పాలనాపరమైన అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నదని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు మూడీస్, ఎస్అండ్‌పీ అంటున్నాయి.

**వేదాంత బాండ్లకు బ్రేక్**

వేదాంత లిమిటెడ్ మాతృ సంస్థ వేదాంత రిసోర్సెస్ లిమిటెడ్ తమ డాలర్ బాండ్ల విక్రయ యోచనను తాత్కాలికంగా నిలిపివేసింది. అయితే అదానీ గ్రూప్‌పై అమెరికాలో లంచం కేసు నేపథ్యంలో వేదాంత నిర్ణయం ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. బాండ్ల జారీ ద్వారా 600 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాలని వేదాంత భావించింది. ఇందుకు సర్వం సిద్ధమైంది కూడా. కానీ ఇప్పుడు వెనక్కితగ్గింది. బాండ్ల అమ్మకం ఎప్పుడు? ఉంటుందన్నది త్వరలోనే తెలియజేస్తామని కంపెనీ చెప్తున్నది. స్టాక్ మార్కెట్ల ఒడిదొడుకులే కారణమని అంటున్నారు. అదానీ కేసు నేపథ్యంలో బాండ్లకు పెద్దగా ఆదరణ ఉండదనే ఈ నిర్ణయానికి వచ్చారా? అన్న సందేహాలున్నాయి.

### ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ డీల్..

అదానీ గ్రీన్ ఎనర్జీ, అజూర్ పవర్.. అప్పట్లో ఈ సోలార్ పవర్ డీల్‌ను ప్రపంచంలోనే అతిపెద్దదిగా పేర్కొన్నాయి. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంచి 6 బిలియన్ డాలర్ల (రూ.45,000 కోట్లు) విలువైన ప్రాజెక్టును గెలుచుకున్నట్టు 2020లో అదానీ గ్రూప్ ప్రకటించింది. దీన్నుంచి పన్ను అనంతర లాభం 2 బిలియన్ డాలర్లపైనే (దాదాపు రూ.16,000 కోట్లు) ఉండొచ్చన్న అంచనాలనూ వేసింది. ఈ ప్రాజెక్టుతో 4 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు లభిస్తాయని, 900 మిలియన్ టన్నుల కార్బన్ డైయాక్సైడ్‌కూ చెక్ పెట్టినట్టు అవుతుందని అదానీ పేర్కొన్నట్టు అమెరికా ప్రాసిక్యూటర్లు చెప్తున్నారు. ఈ క్రమంలోనే లంచాలు ఇచ్చైనాసరే ప్రాజెక్టును దక్కించుకోవాలని చూశారన్న వాదనలు వినిపిస్తున్నాయిప్పుడు.

## అదానీ.. ఆ ఏడుగురు

**దేశంలో** సోలార్ పవర్ విక్రయ ఒప్పందాల్లో అదానీ గ్రూప్‌పై వచ్చిన లంచం, నేరారోపణల్లో మొత్తం ఎనిమిది మందిపై అమెరికాలో కేసులు నమోదయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలు, ఉన్నతాధికారులకు రూ.2,200 కోట్లకుపైగా లంచాలు ఎర వేశారన్న అవినీతి ఆరోపణల్ని వీరంతా ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో ప్రధానంగా రెండు ఆరోపణలున్నాయి. అందులో మొదటిది తప్పుడు ప్రకటనలతో భారత్‌లో సోలార్ పవర్ కాంట్రాక్టులను అడ్డుపెట్టుకొని అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, అమెరికా మదుపరుల నుంచి 2 బిలియన్ డాలర్లకుపైగా రుణాల సమీకరణకు పాల్పడ్డారు. ఇక రెండోది అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను భాగస్వామ్యం చేస్తూ 1 బిలియన్ డాలర్లకుపైగా విలువైన బాండ్లను జారీ చేశారు. వీటిని అమెరికా తదితర మార్కెట్లలో ప్రవేశపెట్టి, అక్కడి మదుపరులకు అమ్మారు. అసలు ఈ కేసులో ప్రధానంగా ఉన్న ఆ ఎనిమిది మందిలో ఎవరెవరున్నారు?

**గౌతమ్ అదానీ**

అదానీ గ్రూప్ చైర్మన్. ఈ కేసుతో సంబంధమున్న అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కూ ప్రమోటర్. సోలార్ పవర్ కాంట్రాక్టులను ఒకే చేసుకొనేందుకు ఆయా ప్రభుత్వ వర్గాలతో గౌతమ్ అదానీ నేరుగా సమావేశమైనట్టు ఆరోపణలున్నాయి. లంచం, అవినీతిని దాచి ఇన్వెస్టర్లను ఉద్దేశపూర్వకంగా మోసం చేశారన్న అభియోగాలు నమోదయ్యాయి.

**సాగర్ అదానీ**

గౌతమ్ అదానీ మేనల్లుడు. అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్. ప్రభుత్వ అధికారులకు ఇస్తామని హామీ ఇచ్చిన లంచాల వివరాలను సాగర్ అదానీ తన్ ఫోన్‌లో దాచుకున్నారన్న ఆరోపణలున్నాయి. నిధుల సమీకరణలోనూ భాగమయ్యారని అంటున్నారు.

**వినీత్ జైన్**

అదానీ గ్రీన్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్. గత 15 ఏండ్లుగా అదానీ గ్రూప్‌లో పనిచేస్తున్నారు. ఎవరెవరికి ఎంతెంత? ముట్టజెప్పాలన్న వివరాలను రాసుకొని తన మొబైల్‌లో వినీత్ జైన్ ఫోటో తీసి పెట్టుకున్నారని అమెరికా ప్రాసిక్యూటర్లు చెప్తున్నారు.

**రంజిత్ గుప్తా**

కుంభకోణం జరిగిన 2019-2022 మధ్య అజూర్ పవర్ గ్లోబల్ లిమిటెడ్ సీఈవోగా వ్యవహరించారు. అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) దాఖలు చేసిన ఫిర్యాదులో రెండో నిందితుడిగా ఉన్నారు. లంచాల్లో కొంత భాగం ఇస్తామని అజూర్ అంగీకరించిందన్న ఆరోపణలున్నాయి.

**రూపేశ్ అగర్వాల్**

2022-2023 మధ్య అజూర్ పవర్‌తో రూపేశ్ అగర్వాల్ పనిచేశారు. అమెరికా అటార్నీ కార్యాలయం వివరాల ప్రకారం లంచాల సొమ్మును సిద్ధం చేసి, దాని పంపిణీలో కీలకపాత్ర పోషించారు.

**సిరిల్ క్యాబెన్స్**

ఈయనకు ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ దేశాల పౌరసత్వం ఉన్నది. కెనడియన్ పెన్షన్ ఫండ్ సీడీపీక్యూలో పనిచేశారు.

**సౌరభ్ అగర్వాల్**

సీడీపీక్యూ మాజీ ఉద్యోగి.

**దీపక్ మల్హోత్ర**

సీడీపీక్యూలో పనిచేశారు. అజూర్ పవర్‌లో సీడీపీక్యూకు మెజారిటీ వాటా ఉన్నది. సీడీపీక్యూ మాజీ ఉద్యోగులైన సిరిల్, సౌరభ్, మల్హోత్ర అనే ఈ ముగ్గురు.. విదేశీ అవినీతి చర్యల చట్టం నిబంధనల్ని ఉల్లంఘిస్తూ లంచాల కేసులో పాలుపంచుకున్నారని ఎఫ్‌బీఐ, అమెరికా ఎస్ఈసీ చెప్తున్నాయి.

## కరిగిపోయిన విదేశీ నిల్వలు



ముంబై, నవంబర్ 22: విదేశీ మారకం నిల్వలు మరింత కరిగిపోయాయి. ఈ నెల 15తో ముగిసిన వారాంతానికిగాను మారకం నిల్వలు 17.76 బిలియన్ డాలర్లు తరిగిపోయి 657.892 బిలియన్ డాలర్లకు తగ్గాయని రిజర్వుబ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితంవారంలోనూ నిల్వలు 6.477 బిలియన్ డాలర్లు తగ్గిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 15.548 బిలియన్ డాలర్లు తరిగిపోయి 569.835 బిలియన్ డాలర్లకు పడిపోవడం వల్లనే విదేశీ నిల్వలు తగ్గాయని తన నివేదికలో వెల్లడించింది. అలాగే గోల్డ్ రిజర్వులు కూడా 2.068 బిలియన్ డాలర్లు తగ్గి 65.746 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అలాగే ఐఎంఎఫ్ వద్ద నిల్వలు కూడా 51 మిలియన్ డాలర్లు తగ్గి 4.247 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని తెలిపింది.

## 7 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

**భారీగా లాభపడిన స్టాక్ మార్కెట్లు**

ముంబై, నవంబర్ 22: దేశీయ స్టాక్ మార్కెట్లు రివ్వున ఎగిశాయి. అదానీ దెబ్బకు గురువారం భారీగా నష్టపోయిన సూచీలు ఆ మరుసటి రోజు ఆకాశమే హద్దుగా దూసుకుపోయాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తిరిగి 79 వేల మైలురాయిని అధిగమించింది. ఇంట్రాడేలో 2 వేల పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్ చివరకు 1,961.32 పాయింట్లు లేదా 2.54 శాతం లాభపడి 79,117.11 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 557.35 పాయింట్లు లేదా 2.39 శాతం లాభపడి 23,907.25 వద్ద స్థిరపడింది. సూచీలు కదంతొక్కడంతో మదుపరుల సంపద లక్షల కోట్ల మేర పెరిగింది. బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.7,32,144.04 కోట్లు పెరిగి రూ.4,32,71,052.05 కోట్ల(5.12 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. మహారాష్ట్ర, జార్ఖండ్ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ విజయం సాధించే అవకాశాలున్నట్లు ఎగ్జిట్ పోల్స్ మదుపరుల్లో సెంటిమెంట్‌ను ప్రభావితం చేసిందని,



**కోలుకున్న అదానీ గ్రూపు షేర్లు**

అదానీ గ్రూపునకు చెందిన ఆరు కంపెనీల షేర్లు లాభ పడగా, నాలుగు సంస్థల షేర్లు నష్టపోయాయి. అంబుజా సిమెంట్ షేరు 3.50 శాతం లాభపడగా, ఏసీసీ షేరు 3.17 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.16 శాతం, అదానీ పోర్ట్స్ 2.05 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 1.18 శాతం, ఎన్‌డీటీవీ షేరు లాభాల్లోకి వచ్చాయి. మరోవైపు అదానీ గ్రూపు సంస్థలు వివరణ ఇవ్వాలని స్టాక్ ఎక్స్చేంజ్‌లు సూచించాయి.

## విద్యార్థులకు అవగాహన


ఏటూరునాగారం, నవంబర్ 22 : మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన నిర్వహించారు. టాస్క్ కోఆర్డినేటర్ రామకృష్ణ విద్యార్థులకు ఉపయోగపడే నూతన కోర్సులు, వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కాగా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీ రేణుక, అధ్యాపకులు రామకృష్ణను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టాస్క్ ఆర్డినేటర్ కనీస్ ఫాతిమా, మెంటర్ రమేశ్, అధ్యాపకులు నవీన్, వెంకటయ్య, జ్యోతి ఉన్నారు.



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మంగపేట, నవంబర్ 22 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, యానయ్య, భగవాన్‌రెడ్డి, ముత్తినేని ఆదినారాయణ, చాద మల్లయ్య, టీవీ హిదయ్‌తుల్లా, సయ్యద్ హుస్సేన్, ఆదినారాయణ, శేషగిరి, నాగరాజు, మూర్తి, గాదె సమ్మయ్య పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలతో నిండిన బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్వహణ కార్యాలయ భవనం

## పట్టింపులేక పాడుబడుతున్నది !

### అడవిని తలపిస్తున్న బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్వహణ కార్యాలయం

వాజేడు, నవంబర్ 22 : అధికారుల పట్టింపులేక బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్వహణ భవనం పిచ్చి మొక్కలతో నిండి శిథిలావస్థకు చేరింది. కార్యాలయ ఆవరణ మొత్తం తుప్పలు మొలిచి చిట్టడవిని తలపిస్తున్నది. మండలకేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ బ్రాడ్ బ్యాండ్ సేవలతో పాటు ప్రస్తుతం టవర్ నిర్వహణకు ప్రభుత్వ కార్యాలయం ఉంది. గతంలో ఈ భవనంలో ఒకవైపు బ్రాడ్‌బ్యాండ్‌కు సంబంధిన కార్యాలయం తోపాటు మరో గదిలో సెర్ఫ్ కార్యాలయం నిర్వహణ కొనసాగేది. స్త్రీ శక్తి భవన నిర్మాణం చేపట్టడంతో సెర్ప్ కార్యాలయం అందులోకి మార్చారు. అప్పటి నుంచి టవర్ నిర్వహణ కార్యాలయం సామగ్రి ఇందులోఉంచి నిర్వహణ కొనసాగిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీంతో విలువైన ప్రభుత్వ భవనం పట్టింపునకు నోచుకోకుండాపోయింది. గతంలో దీనికి అదనపు నిధులు సైతం వెచ్చించి గ్రామ పంచాయతీ గెస్ట్‌హౌస్‌గా మార్చేందుకు అధికారులు దృష్టిసారించి ఆపై మరిచారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకొని భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



నాగారం ప్రధాన రహదారిపై కూరగాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులు



నాగారం గ్రామంలోకి వెళ్లే దారిని ఆనుకొని ఏర్పాటు చేసిన దుకాణాలు

## ప్రధాన రహదారిపైనే నాగారం సంత

**ఇబ్బందులు పడుతున్న వాహనదారులు**

వాజేడు, నవంబర్ 22 : మండలకేంద్రంలోని నాగారం గ్రామ పంచాయతీలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న వారాంత సంతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏండ్లు గడుస్తున్నా అధికారులు ప్రత్యేక స్థలం కేటాయించకపోవడంతో వ్యాపారులు వాజేడు మీదుగా గుమ్మడిదొడ్డి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన, నాగారం, జంగాలపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఆ రహదారులు వాహనాలు, కొనుగోలు కోసం వచ్చే ప్రజలతో రద్దీగా మారుతున్నాయి. ప్రయాణికులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం సంత పాటలు నిర్వహించి నగదు తీసుకుంటున్న గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక స్థలం కేటాయించకపోవడంపై స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీపీ అధికారులు చొరవ చూపి సంత నిర్వహణకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ

కాటారం, నవంబర్ 22 : మండలంలోని కొత్తపల్లి, కాటారం మార్కెట్ యార్డు, రేగులగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం సేకరణలో జాప్యం చేయొద్దని ఇన్‌చార్జీలను ఆదేశించారు. ధాన్యాన్ని ట్యాగ్ చేసిన రైస్ మిల్లులకు తక్షణమే తరలించాలని ఆదేశించారు. రిజిస్టర్ల నిర్వహణ, ట్రక్ షీట్స్, ప్యాడీ క్లీనింగ్ యంత్రాలను పరిశీలించారు. పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, పీఏసీఎస్ సీఈవో సతీశ్, కేంద్రాల ఇన్‌చార్జిలు ఉన్నారు.

## దీపం అంటుకొనే మంటల చెలరేగాయి

### వివరాలను వెల్లడించిన కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మహదేవపూర్,నవంబర్ 22 : మండలంలోని అంబట్‌పల్లి హనుమాన్ ఆలయంలో దీపం అంటుకొని మంటలు చెలరేగినట్లు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సీఐ రామచంద్రారెడ్డి ,ఎస్సై పవన్ కుమార్‌తో కలిసి ఆలయం వద్ద గ్రామస్తులు, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, పూజారిని, పలువురిని విచారిచారు. అనంతర ఆయన వివరాలను వెల్లడించారు. 21న (గురువారం)కార్తీక మాసం సందర్భంగా కుజ దోష పూజలు చేసిన అనంతరం భక్తులు హనుమాన్ విగ్రహానికి చందనం, నూనె పూసి తర్వాత ఎండు కుడుకలో నూనె పోసి దీపం వెలిగించి స్వామి వారి పాదాల వద్ద పెట్టి వెళ్లారన్నారు. తర్వాత పూజారి సైతం ఇంటికి వెళ్లినట్లు చెప్పారు. ప్రమాదవశాత్తు హనుమాన్ పాదాల వద్ద పెట్టిన కుడుకలోని దీపం అంటుకొని విగ్రహానికి ఉన్న చందనం, నూనె కారణంగా మంటలు వ్యాప్తి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, ప్రచారాలను నమ్మవద్దని డీఎస్పీ సూచించారు. పూర్తి సమాచార నిమిత్తం మరింత దర్యాప్తు చేస్తామన్నారు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



భారత యాదవ మహాసభ దామెరకుంట కార్యవర్గం

## యాదవ సంఘం దామెరకుంట గ్రామ కమిటీ


కాటారం, నవంబర్ 22 : అఖిల భారత యాదవ సంఘం దామెరకుంట గ్రామ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మొగిలి లచ్చయ్య, అధ్యక్షుడిగా ముద్దం రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సిద్ధి చిన్న గట్టయ్య, ప్రధాన కార్యదర్శిగా ముద్దం రమేశ్, కోశాధికారిగా పెద్ద గట్టయ్య, సహాయ కార్యదర్శిగా బోయిన సమ్మయ్య, ప్రచార కార్యదర్శిగా ఇరవేన ఓదన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ అడ్‌హక్ కమిటీ సభ్యులు గడ్డం చంద్రయ్య, అబ్బినేని ఐలయ్య, గడవేని దేవేందర్, శ్రీశైలం, ముల్కల సంతోష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వో సురేశ్‌బాబు

## బీమా పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఏటూరునాగారం, నవంబర్ 22 : 18 నుంచి 70 సంవత్సరాల మధ్య ఉన్న వారు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని ఏటూరునాగారం ఐటీడీఏ ఎస్‌వో సురేశ్‌బాబు అన్నారు. ఈ రెండు పథకాలపై శుక్రవారం గిరిజన పోస్ట్‌మెట్రిక్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎంఎస్‌బీవై వార్షిక ప్రీమియం రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాద భీమా లభిస్తుందని తెలిపారు. పీఎంజేజేబీవై వార్షి ప్రీమియం రూ.436 చెల్లిస్తే రూ.2లక్షల వరకు జీవన బీమా లభిస్తుందని పేర్కొన్నారు. ఖాతా ఉన్న అన్ని బ్యాంకుల్లో ఈ బీమా కట్టుకునే వెసులుబాటు జనవరి 15 వరకు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేడీఎం కొండల్‌రావు, ఎల్‌డీఎం జయప్రకాశ్, కెనరా బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్, ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ అనిల్, ఐటీడీఏ సిబ్బంది భాస్కర్, మాధురి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభల కరపత్రాలు విడుదల చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

## మహా సభలను విజయవంతం చేయాలి

కృష్ణకాలనీ, నవంబర్ 22 : హైదరాబాద్‌లో జనవరి 5, 6, 7 తేదీల్లో నిర్వహించే అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం రెండో మహా సభలను విజయవంతం చేయాలని డీహెచ్ పీఎస్ జిల్లా కార్యదర్శి రాసపల్లి భద్రయ్య కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో మహా సభల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నేరెళ్ల జోసెఫ్, పీక రవికాంత్, పొనగంటి లావణ్య, దొంతుల రవీందర్, పెద్దమాముల సంధ్య, లోక రాజబాబు, చల్లూరి రక్షిత, బండారి తిరుపతి పాల్గొన్నారు.

## డిసెంబర్ 6,7న సీపీఎం మహా సభలు

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 22 : డిసెంబర్ 6,7 తేదీల్లో ఏటూరునాగారంలో జరిగే సీపీఎం పార్టీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో సీపీఎం పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కార్యదర్శి గ్యానం వాసు, నాయకులు కట్ల చారి, కుమ్మరి శ్రీను, వంక రాములు, ఆదినారాయణ, మాణిక్యం, వరప్రసాద్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాంబిరెడ్డి